


శ్రీకాళహస్తిలోని నారద పుష్కరిణి సమీపంలో వెలసిన వినాయక ఆలయంలో మనిషిని ఆలోచింపజేసే విధంగా ఏర్పాటు చేసిన బోధ గణపతి వినాయకుడు



సూళ్లూరు పేటలోని బాపూజీ వీధిలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ చిన్ని సత్యనారాయణ పర్యవేక్షణలో 60 వేల గాజులతో ప్రత్యేకంగా తయారు చేసిన గాజుల గణపతి వినాయకుడు

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# సీపీఎస్ రద్దు చేయాలని నిరసన

- సెప్టెంబర్ 1న బ్లాక్‌డే
- కలెక్టర్ కార్యాలయం ఎదుట రాష్ట్ర ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నిరసన, ర్యాలీ




కలెక్టర్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన చేస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త ః
రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని రాష్ట్ర ఏపీసీపీఎస్ఈఏ, ఏపీ జేఏసీ, ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు తిరుపతి కలెక్టర్ కార్యాలయం ఎదుట సెప్టెంబర్ 1 రోజు బ్లాక్ డే సందర్భాన్ని పురస్కరించుకుని వారు నల్లబ్యాడ్జీలను ధరించి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. అంతకు ముందు ర్యాలీగా కలెక్టర్ కార్యాలయాని చేరుకుని ఏపీ రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చీర్ల కిరణ్, ఏపీ జేఏసీ తిరుపతి జిల్లా ప్రెసిడెంట్ సురేష్‌బాబు, సెక్రటరీ నిర్మల, సభ్యులు రంగానాయక్, వంకీపురం పవన్, మురళీ, నైనార్, తదితరులు మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వారం, నెల రోజుల్లోనే సీపీఎస్‌ను రద్దు చేస్తానని ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలన్నారు. లేని పక్షంలో ఛలో విజయవాడ మిలియం మార్చ్‌కి పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. అయితే పోలీసులు ముందస్తు నాయకులను అరెస్టు చేసేందుకు ప్రయత్నించడం, బైండోవర్ చేయడం, సెలవులు ఇవ్వక పోవడం దారుణమన్నారు. పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల నేతలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## చిత్తూరులో కొవ్వొత్తుల నిరసన




గాంధీ విగ్రహం ఎదట సిపిఎస్ రద్దు డిమాండ్‌తో ఎస్టీయు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన

చిత్తూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:
కాంట్రీబ్యూటరీ పెన్షన్ విదానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రాత్రి ఎస్టీయు ఆధ్వర్యంలో చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట ఆ సంఘ నాయకులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్టీయు సంఘ నాయకులు గంటామోహన్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిపిఎస్ విధానంను సత్వరం రద్దు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, దేవరాజులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ధ్వజారోహణం

## కాణిపాకంలో శాస్త్రోక్తంగా అంకురార్పణ





ధ్వజరోహణం సందర్భంగా బంగారు ధ్వజస్థంభంపై మూషిక పటాన్ని ఎగురవేస్తున్న అర్చకులు, ఆలయంలో చేపట్టిన విశేషాలంకరణ

కాణిపాకం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ధ్వజారోహణం కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఆలయంలో బుధవారం నుండి ఈనెల 20 వరకు 21 రోజులుపాటు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా తొమ్మిది రోజులు పాటు జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాలకు గురువారం అంకురార్పణ జరిగింది. ఈమేరకు ఉదయం స్వాతినక్షత్రం, కన్యాలగ్నం నందు ఉదయం 8.15 గంటల నుండి 9.15 గంటల మధ్య ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాలకు బ్రహ్మాది దేవతలను ఆహ్వానిస్తూ బంగారు ధ్వజస్థంభంపై మూషికపటాన్ని ఎగురవేశారు. అనంతరం బంగారు ధ్వజస్థంభానికిసుగంధ ద్రవ్యాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. అ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబు, ఈఈ వెంకట నారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు ధర్మేశ్వర గురుకుల్, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, స్థానిక సర ్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు భక్తులు పాల్గొన్నారు.

### ఆలయంలో శాస్త్రోక్తంగా అంకురార్పణ

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈమేరకు అర్చకులు గ్రామ సమీపంలో పుట్ట మన్ను సేకరించి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రధాన ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో అంకురార్పణ గావించారు. ఈ యాగశాలలో నవరాత్రి దీక్షాహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన అర్చకులు దర్మేశ్వరగురుకుల్‌ల ఆధ్వర్యంలో అర్చక స్వాములు అష్టోత్తర కలశాలను (108) ఏర్పాటు చేసి పూజలు చేసి కలశస్థాపన, అగ్నిప్రతిష్టహోమం నిర్వహించారు.



## హంసవాహనంపై విహరించిన విఘ్ననాధుడు

కాణిపాకం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:
కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి ఉభయదేవేరులతో కలసి గణనాధునికి హంసవాహనం సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గురువారం ఉదయం ధ్వజారోహణం కార్యక్రమం జరుగగా రాత్రి స్వామివారికి హంసవాహన సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం, అగరంపల్లె, కారకాంపల్లె, వడ్రాంపల్లె, తిరువణంపల్లె గ్రామాదుల శీర్‌కరుణీకర్ వంశస్థులు ఉభయదాతలుగా వ్యవహరించారు. వీరు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అలాగే రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సమూర్తులను ప్రాకార మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అలంకార మండపంలో వుంచి అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ ప్రత్యేకపూజలతో ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. వివిధరకాల పరిమళ పుష్పాలతో అలంకరించిన హంసవాహనంపై స్వామి అమ్మవార్లను వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు, ఈఈ వెంకట నారాయణ, ఏసీ కస్తూరి, ఏఈఓలు విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, హేమమాలిని, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాబు, రమేష్, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డిలతో పాటు ఆలయ అధికారులు పాల్గొన్నారు..

# భూముల రీ-సర్వే మరింత వేగవంతం

చిత్తూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ-సర్వే కార్యక్రమంను మరింత వేగవంతం చేయాలని సిసిఎల్ఏ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ అన్నారు. సిసిఎల్ఏ కార్యదర్శులు సాయి ప్రసాద్, సిద్ధార్థ్‌జైన్, బాబు అహ్మద్‌లు గురువారం భూముల రీ-సర్వే కార్యక్రమంపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో సిసిఎల్ఏ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మాట్లాడుతూ భూముల రీ-సర్వే క్షేత్ర స్థాయిలో జరిగే తీరును సంబంధిత డిఐలు రోజువారి సమీక్ష చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ వారంకు ఒకసారి, కలెక్టర్‌లు సైతం సమీక్షలు నిర్వహించి రీ-సర్వే పక్కాగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్టోబర్ 2 నాటికి నిర్ధేశించే మేరకు 13 నోటిఫికేషన్లు ఇవ్వాలన్నారు. అలాగే ప్రస్తుతం డ్రోన్ సర్వే పూర్తయిన చోట్ల ఓఆర్ఐ షీట్లు వేగవంతంగా వస్తున్నాయని, ఈ మేరకు క్షేత్ర స్థాయిలో కచ్చితత్వం పక్కాగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంను నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మ్యూటేషన్ కార్యక్రమాలు వంద శాతం పూర్తి చేయాలని ఎక్కడైనా క్షేత్ర స్థాయిలో సమస్యలు వుంటే కలెక్టర్లు ఫైళ్ళు తెప్పించుకొని సత్వరం పరిష్కరించాలన్నారు. అలాగే అర్హులైన వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కార్యదర్శులు స్పష్టం చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## 69 గ్రామాలలో రీ సర్వే

- 1021 గ్రామాల్లో డ్రోన్ పై పూర్తి చేశాం
- జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త ః వైఎస్ ఆర్ జగనన్న భూ హక్కు-భూ రక్ష పథకంలో భాగంగా రాష్ట్రంలో భూముల రీ సర్వే వేగవంతం చేయాలని సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం అమరావతి నుంచి సీసీఎల్ఏ చీఫ్ సెక్రటరీ అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సర్వే అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, జేసీ డీకే బాలాజీ, డీఆర్వో శ్రీనివాసరావు, జిల్లా సర్వే అధికారి జయరాజ్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో 1051 గ్రామాలకు గాను డ్రోన్‌పై 1021 గ్రామాలలో పూర్తి చేశామని తెలిపారు. రీ సర్వేకు సంబంధించి నేటికి 69 గ్రామాలలో పూర్తి కావడం జరిగిందని వివరించారు. పైలెట్ ప్రాజెక్టులుగా చేపట్టిన జిల్లాలోని చంద్రగిరి మండలం, నరసింహాపురం, చిల్లకూరు మండలం, యోగేశ్వరునిపల్లి, గూడూరు మండలం, రెడ్డిగుంట, నాయుడు పేట మండలం, తిమ్మాజీ కండ్రిగ గ్రామాలలో సచివాలయాల స్థాయిలో రిజస్ట్రేషన్ ప్రక్రియ జరుగుచున్నదన్నారు. లక్ష్యం మేరకు రీ సర్వే పూర్తి చేయనున్నామని వివరించారు.



## దొంగతనాల నియంత్రణకు

# నిఘా ఉంచండి


బ్రహ్మోత్సవాల్లో స్నేహపూర్వక సేవలు :డిఐజి రవిప్రకాష్



తిరుమల, సెప్టెంబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:
పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే సమయంలోనేగాక తరచూ దొంగతనాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా వుంచాలని అనంతపురం రేంజ్ డిఐజి ఎం.రవిప్రకాష్ ఆదేశించారు. కొండపై 27నుంచి మొదలుకానున్న శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేసే అశేషసంఖ్య భక్తులకు పోలీసులు స్నేహపూర్వక వాతావరణం కల్పించి, భద్రత చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. తిరుమలలో తరచూ జరిగే నేరాలు, నమోదయ్యే కేసులు, వాటి పరిష్కారానికి పోలీసులు తీసుకుంటున్న చర్యలు పై డిఐజి రవిప్రకాష్ ఆరాతీశారు. గురువారం ఉదయం అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్, టిటిడి సివిఎస్ఓ నరసింహకిశోర్, తిరుపతి జిల్లా ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి, తిరుమల అదనపు ఎస్‌పి మునిరామయ్య, టిటిడి విజిఓ బాలిరెడ్డితో కలసి ఆలయం పరిసరాలు, మాఢవీధులు, క్యూలైన్ల నిర్వహణ, కమాండ్ కంట్రోల్ కేంద్రం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తిరుమల ట్రాఫిక్ డిఎస్పీ వేణుగోపాల్, సిఐలు పి.జగన్మోహన్‌రెడ్డి(1టౌన్), కె.చంద్రశేఖర్(2టౌన్), ఏవిఎస్ఓలు అల్లంసురేంద్ర, సాయిగిరిధర్, శివయ్య ఉన్నారు. అనంతరం తిరుమల 2టౌన్ పోలీసుస్టేషన్‌ను డిఐజి వార్షిక తనిఖీలు చేపట్టి రికార్డులను పరిశీలించారు.

### ఉష్ణోగ్రతలు

1/9/2022



- తిరుపతి 27 డిగ్రీలు
- చిత్తూరు 29 డిగ్రీలు
- మదనపల్లి 23 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 29 డిగ్రీలు
- వెంకటగిరి 30 డిగ్రీలు
- గూడూరు 30 డిగ్రీలు

### బంగారం ధరలు

1/9/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,710

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,138

### కోడిగ్రుడ్ల ధరలు

1/9/2022



కోడిగ్రుడ్డు :రూ.5.00

1 డజను: రూ.60.00

## తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

తిరుపతి క్రైం, సెప్టెంబరు 1 ప్రభాతవార్త ః
ఏపీ రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డీజీ శంఖ బ్రత భాగ్ని ఉత్తర్వులు మేరకు తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె. ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం తిరుపతి, చిత్తూరు జిల్లాలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో మూడు టీమ్‌లుగా ఏర్పడి బంగారు పాళ్యెం, నారావారిపల్లె, వాకాడులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఏపీ ఆరోగ్యశాఖవారు ఇవ్వబడిన సూచనల ప్రకారం రోగులకు చికిత్స జరుగుతున్నదా, తగిన వసతులు ఉన్నాయా, వైద్యులు, నర్సులు అందుబాటులో ఉంటున్నారా, రోగులకు వైద్య పరీక్షలు నిర్వహణ, మందులు తగినంతగా ఉన్నాయా అనే విషయాలపై తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రైనీ కలెక్టర్‌గా మేఘ స్వరూప్

చిత్తూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:
జిల్లా ట్రైనీ కలెక్టర్‌గా మేఘ స్వరూప్ నియమితులయ్యారు. కర్నూలు జిల్లా నంద్యాల నారాయణపురంకు చెందిన మేఘ స్వరూప్ వారణాసి ఐఐటిలో చదివారు. 2020లో ఐఎఎస్ సాధించిన మేఘ స్వరూప్‌ను ప్రభుత్వం ట్రైనీ కలెక్టర్‌గా నియమించింది. ఈయన చిత్తూరులో వుండి వివిధ శాఖల మీద శిక్షణను పొందనున్నారు. ఈయన 1990 సెప్టెంబర్ 17న పవర్ గ్రిడ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్‌రావు, అరుణ దంపతులకు



## భక్తులకు సౌకర్యవంతంగా టిటిడి సత్రాలు

ఆధునీకరించి వసతులు కల్పిస్తాం :టిటిడి ఛైర్మన్ సుబ్బారెడ్డి



4లో

## మన్నసముద్రంలో పలు కార్యక్రమాలకు భూమిపూజ



శ్రీమహాగణపతియే నమః
శ్లో॥అప్పాలును అరటిపండ్లును
తెప్పలుగా తేనెతొనలు తెత్తురునీకున్
కుప్పలుగా వరమిత్తువు అప్పడవు
కాణిపాక పిళ్ళారప్పా॥

**కాణిపాకంలో నేడు (శుక్రవారం)**

**ఉదయం : అభిషేకం -రాత్రి : నెమలివాహనసేవ**

ఉభయదారులు : కాణిపాకం, చినకాంపల్లె, కొత్తపల్లె, చిగరపల్లె, అగరంపల్లె, వడ్రాంపల్లె, దామరకుంట, కురప్పల్లె, గ్రామాదుల రెడ్డి వంశస్థులు

సాంస్కృతిక కార్యక్రమాలు: ఉదయం 10 నుండి 12 గంటల వరకు వి.శాంతకుమారి, పూతలపట్టు వారిచే ధార్మికోపాన్యాసము, 12 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు టి.గీత, పెద్దతయ్యూరు వారిచే హరికథ, 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఆర్.సులోచన, చిత్తూరు వారిచే భక్తి గీతాలు, 4 గంటల నుండి 6 గంటల వరకు తిరువూరు గోదా నరసింహారావుచే భక్తిరంజని, 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఎ.లేఖన, హైదరాబాద్ వారిచే భరతనాట్యం, 9 గంటల నుండి 12 గంటల వరకు పి.కృష్ణారెడ్డి, వెదురుకుప్పం వారిచే శ్రీరాంజనేయయుద్ధం పౌరాణిక నాటకం, గ్రామోత్సవం ప్రారంభమయినప్పటి నుండి కోలాటాలు వంటి కార్యక్రమాలు.

## కాణిపాకంలో వైభవంగా చవితి వేడుకలు-జనసంద్రంగా కాణిపాకం ఆలయం



కాణిపాకం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో బుధవారం వినాయకచవితి వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. విఘ్ననాధుని చెంత ఈవేడుకలను సంప్రదాయబద్ధంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా నూతన ఆలయంలో స్వామివారికి ఉభయదారులచే ఉదయం 3 గంటలకు ప్రత్యేక అభిషేకం నిర్వహించిన అనంతరం నాలుగు గంటల నుండి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబుల ఆధ్వర్యంలో ఆలయ అధికారులు పర్యవేక్షించారు. వినాయకచవితి సందర్భంగా ఆలయాన్ని వివిధరకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. అదేవిధంగా వివిధ ప్రాంతాలలో గణేష్‌దీక్ష చేపట్టిన భక్తులు వినాయకచవితి సందర్భంగా కాణిపాకంలో ఇరుముడులను సమర్పించగా సాయంత్రం స్వామివారికి శ్రీకాణిపాకం విఘ్నేశ్వరా యువజన సంఘంవారిచే పుష్పకావళ్ళను సమర్పించారు. ఈమేరకు యువజన సంఘం ఆధ్వర్యంలో భక్తులు కావళ్ళను ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. వ్రతాన్ని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు ఎంఎస్.బాబు, ఆరణి శ్రీనివాసులుతో కలసి లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా సిద్ధి బుద్ధి వినాయకస్వామివారి ఉత్సవమూర్తులను ఆస్థానమండపంలో వుంచి వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ వినాయక వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

**ఆకట్టుకున్న ప్రత్యేక అలంకరణ:**

వినాయకచవితి సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయంలోని బంగారు ధ్వజస్థంభం, ఆన్వేటి మండపం, అలంకార మండపంలను వివిధరకాల విదేశి, స్వదేశీజాతి పుష్పాలు, మామిడితోరణాలు, అరటిచెట్లుతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఈప్రత్యేక అలంకరణ భక్తులను ఎంతో ఆకట్టుకుంది. అలాగే ప్రధాన ఆలయంతో పాటు పరివార ఆలయాలను విద్యుత్ ద్దీపాలతో దేదీప్యమానంగా అలంకరించారు.

**పట్టు వస్త్రసాల సమర్పణ:**

వినాయకచవితి సందర్భంగా జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు దివంగత మహదేవనాయుడు కుటుంబ సభ్యులు స్వామివారికి పట్టువస్త్రాలను అందజేశారు. స్వామి, అమ్మవార్లకు ప్రతిఏటా మహదేవనాయుడు కుటుంబీకులు పట్టువస్త్రాలను అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు బుధవారం పట్టువస్త్రాలను ఆలయ అధికారులకు అందజేశారు.

**ఘనంగా గ్రామోత్సవం:**

వినాయకచవితి పండుగ పర్వదినం సందర్భంగా స్వామివారికి బుధవారం రాత్రి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. కరోనా నేపథ్యంలో గత రెండేళ్ళుగా ప్రాకారోత్సవంకే పరిమితంగా కాగా నూతన ఆలయం ప్రారంభం కావడంతో ఈఏడాది గ్రామోత్సవంను నిర్వహించారు.ఈమేరకు అలంకరించిన స్వామివారి అమ్మవార్ల ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన పల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు.

**ఉచిత ప్రసాదాల పంపిణీ:**

వినాయకచవితి సందర్భంగా దేవస్థానంతో పాటు పలువురు దాతలు ఉచితంగా ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈమేరకు దేవస్థానం ఆధ్వర్యంలో ఉదయం నుండి రాత్రి వరకు పులిహోర, పొంగలి వంటి ప్రసాదాలను పంపిణీ చేశారు. ఉచిత ప్రసాదాల పంపిణీ కార్యక్రమంను ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు ప్రారంభించారు.

**ఇరుముడి దీక్షా మండపం ప్రారంభం:**

కాణిపాకం దేవస్థానంలో గణేష్ దీక్ష చేపట్టే భక్తుల కోసం బుధవారం గణేష్‌దీక్షా మండపాన్ని ప్రారంభించారు. ప్రతి ఏటా వినాయకచవితి సందర్భంగా భక్తులు గణేష్‌దీక్ష చేపట్టి ఆలయంలో స్వామివారికి ఇరుముడులు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు దేవస్థానం అనుబంధ ఆలయమైన మరగదాంబిగా సమేత మణికంఠేశ్వరాలయం వద్ద గణేష్‌దీక్షా మండపాన్ని ప్రారంభించారు. ఇదిలా వుండగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి గణేష్‌దీక్ష చేపట్టిన భక్తులు బుధవారం కాణిపాకం చేరుకుని ఇరుముడులు సమర్పించారు. వీరికి ఆలయం వద్ద అధికారులు ప్రత్యేక దర్శనాలను ఏర్పాటు చేశారు. ఈవేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు, ఈఈ వెంకట నారాయణ, ఏసీ కస్తూరి, ఏఈఓలు విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, హేమమాలిని, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాబు, రమేష్, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డిలతో పాటు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తా

**- రుయా నూతన సూపరింటెండెంట్ డాక్టర్ నాగ మునీంద్రుడు**



తిరుపతి నగరం, సెప్టెంబరు 1 ప్రభాతవార్త : పేదల ప్రజలకు మెరుగైన వైద్యం అందజేసే విధంగా చర్యలు తీసుకుంటానని రుయా ఆస్పత్రి నూతన సూపరింటెండెంట్ డాక్టర్ నాగ మునీంద్రుడు తెలియజేశారు. డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు అందుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయలసీమకే తలమానికమైన రుయా ఆస్పత్రిలో పేద ప్రజలతో పాటు రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించేందుకు నిరంతరం సైనికుల్లా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే డాక్టర్ నాగ మునీంద్రుడు ఆర్థోపెడిక్ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన నాగమునీంద్రుడికి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, డాక్టర్లు, సిబ్బంది, అసోసియేషన్ నేతలు శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

## భక్తులకు సౌకర్యవంతంగా టిటిడి సత్రాలు

**-ఆధునీకరించి వసతులు కల్పిస్తాం :టిటిడి ఛైర్మన్ సుబ్బారెడ్డి**



తిరుమల/తిరుపతి,సెప్టెంబర్ 1ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం దేశంలోని పలు ప్రాంతాల నుంచి తిరుమలకు విచ్చేస్తున్న సామాన్యభక్తులకు మరింత సౌకర్యవంతంగా వసతి కల్పించేందుకు చూస్తామని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి తెలిపారు. భక్తులకు తిరుపతిలోని గోవిందరాజస్వామి సత్రాల్లో కూడా మెరుగైన వసతులు సమకూరుస్తామన్నారు. త్వరలోనే ఈ సత్రాలను ఆధునీకరిస్తామని చెప్పారు. గురువారం సాయంత్రం ఛైర్మన్ సుబ్బారెడ్డి, బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులతో కలసి టిటిడి గోవిందరాజస్వామి సత్రాలను తనిఖీ చేశారు. తిరుపతి రైల్వేస్టేషన్, ఆర్టీసి బస్టాండుకు సమీపంలో సత్రాలు ఉండటంతో సామాన్యభక్తులు ఎక్కువగా ఇక్కడే బసచేసి దర్శనానికి తిరుమలకు వస్తున్నారన్నారు. ఈ గదుల్లో భక్తులకు అనుకూలంగా మంచాలు, పరుపులు ఏర్పాటుచేయాలని అదికారులను ఆదేశించారు. రెండు,మూడు సత్రాలను ఆధునీకరించి భక్తులకు మరింత సౌకర్యవంతంగా సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గదులతోబాటు లీకేజీలు అరికట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సామూహిక వంటశాలలో ఫ్యాన్లు ఏర్పాటుచేసి, యాత్రికులు ఉపయోగించుకునే విధంగా చూడాలన్నారు. దేశంలోని ఏ ఆలయాల్లోనూ ఇలాంటి వసతులు లేవని మధ్యప్రదేశ్ భక్తులు అభిప్రాయపడ్డారు. ఉచిత గదుల ప్రాంగణంలోని మధ్యప్రదేశ్ రాష్ట్రం జాక్వా పట్టణానికి చెందిన భక్తులతో ఛైర్మన్ సుబ్బారెడ్డి మాటామంతీ పలకరించారు. తిరుపతి, తిరుమలలో దర్శనం, భోజనం, ఇతర సదుపాయాలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. 22 రోజుల దక్షణభారదేశ యాత్ర చేపట్టామని,తిరుపతిలో టిటిడి కల్పించిన సౌకర్యాలు ఎక్కడా లేవన్నారు. గోవిందరాజస్వామి సత్రాల్లో సామాన్యభక్తులు బసచేయడానికి మరింత అనువుగా చూడాల న్నారు. మొబైల్‌ఫోన్ పోగొట్టుకుంటే ఇక్కడ ఫిర్యాదు చేసిన వెంటనే గంటలోనే అప్పగించారని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. తిరుపతిలోని గోవిందరాజస్వామి సత్రాల్లో అన్ని వసతులు బావున్నాయని, 50 రూపాయలు చెల్లించి బుధవారం గదిని అద్దెకు తీసుకున్నానని,తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలుకు చెందిన భక్తుడు చక్రం తెలైపారు. తిరుమలలో స్వామిదర్శనం మూడుగంటల్లో అయ్యిందని అన్నారు. దాదాపు 61 సంవత్సరాల క్రిందట గోవిందరాజస్వామిసత్రాలు నిర్మించారని, అన్ని గదులను ఆధునీకరించి. మరింత వసతులు సమకూర్చుతామని ఛైర్మన్ తెలిపారు. ఈ తనిఖీల్లో జెఇఒ వీరబ్రహ్మం, సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఇఒ భారతి పాల్గొన్నారు.

## ఆస్ట్రేలియాలో ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి




పుత్తూరు, సెప్టెంబరు 1 ప్రభాతవార్త : దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతిని ఆస్ట్రేలియాలోని బ్రిస్‌బేన్ నగరంలో స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పటి వరకూ రాష్ట్రంలో లేనటువంటి పలు వినూత్న సంక్షేమ పథకాలను వై.ఎస్. రాజశేఖరరెడ్డి అమలు చేశారని తెలిపారు. ఆయన మృతి అనంతరం ఆయన కుటుంబాన్ని రోడ్డుపై నిలబెట్టాలని కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధి తలచారని, అయితే అదే కుటుంబంలోంచి వచ్చిన జగన్మోహనరెడ్డి రాష్ట్రంలో రాజన్న పాలనను సుస్థిరపరిచారని తెలిపారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగు నింపాలనే ఉద్దేశ్యంతో జగన్ కూడా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని 175 సీట్లు గెలిపించి రాజన్న పాలనను ప్రజలకు అందించాలని తెలిపారు. సమావేశంలో నాయకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, పలువురు ప్రవాస భారతీయులు పాల్గొన్నారు.

## పేదలనోటి కూడును దోచుకుంటున్న సిఎం

**-ఉచిత బియ్యం పంపిణీ రద్దుపై టిడిపి నిరసన**




తిరుపతి,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: బడుగు,బలహీన వర్గాలు, కార్మికుల కడుపునింపేందుకు అమలవుతున్న చౌకదుకాణాల ద్వారా బియ్యం పంపిణీని అక్రమమార్గాల్లో తరలిస్తున్నారని, కేంద్రంలోని ప్రధాని మోదీ ఉచిత బియ్యం పంపిణీకూడా రాష్ట్రంలో పక్కదారిపట్టిస్తున్నారని టిడిపి నాయకులు ఆరోపించారు. పేద ప్రజల నోటి కూడును దోచు కుంటూ విదేశాలకు తరలించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొమ్ముచేసుకుంటున్నారని టిడిపి నేతలు విమర్శించారు. పేదప్రజలకు చౌకదుకాణాల ద్వారా అందించాల్సిన ఉచిత బియ్యం రాష్ట్రప్రభుత్వం, జగన్ ప్రభుత్వం ఇవ్వకపోవడం దారుణమన్నారు. దాదాపు ఐదునెలలు పాటు ఉచిత బియ్యాన్ని పేదప్రజలకు ఇవ్వకుండా దగా చేశారన్నారు. 1.44కోట్ల రేషన్‌కార్డులు ఉన్నాయని, అందులో 4.52కోట్లమంది సభ్యులున్నారన్నారు. కేంద్రప్రభుత్వం హెచ్చరికలు నేపథ్యంలో ఆగస్టులో ఉచిత బియ్యం పంపిణీకి రాష్ట్రప్రభుత్వం సిద్ధమైనప్పటికీ కులం,ప్రాంతం వివక్షతతో లక్షలాదిమందికి రేషన్ అందించకుండా మోసం చేశారని ఆరోపించారు. ఆకలికి కూడు కులం పేరుతో ప్రాంతం పేరుతో వివక్షత చూపడం జగన్‌రెడ్డి అరాచకానికి సాక్ష్యమన్నారు. గతంలో బియ్యానికి బదులు నగదు ఇచ్చేందుకు ప్రయత్నించి డబ్బు ఇస్తున్నందున రేషన్ కూడా రద్దుచేసి అన్ని సంక్షేమ పథకాలు ఎత్తివేసేందుకు ప్రయత్నించారన్నారు. అనంతరం ఎంఆర్‌పల్లిలోని ఓ రేషన్‌దుకాణం వద్ద నిరసన తెలిపి తాశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ నిరసన కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జిలు ఎం.సుగుణమ్మ, నరసింహయాదవ్, రాష్ట్ర,జిల్లా, నగర కమిటీ నాయకులు బుల్లెట్‌రమణ, సూరా సుధాకర్‌రెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, ఊట్ల సురేంద్రనాయుడు, వట్టికుంట శంకరనారాయణ, మహేష్ యాదవ్, బ్యాంకు శాంతమ్మ, కుమారమ్మ, రామ్మూర్తిరాయల్, శ్యాం భోల్‌భ హరి, మనోహరాచారి, వేణుగోపాల్‌నాయుడు, ఆనంద్ యాదవ్, రామచంద్రారెడ్డి, విశ్వ నాథ్, రాజారాం, గంగులయ్య, అనిత, హేమ,శ్రీరాములు, మధు, హేమంత్, నాగరాజు, భారతి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఎంఎల్‌సీ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా వాకాటి



తడ, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త : రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎంఎల్‌సీ ఎన్నికలకు బీజేపీ తరపున ఇన్‌ఛార్జ్‌గా శాసనమండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి నియమితులయ్యారు. తడ మండలం చేనిగుంటకు చెందిన స్థానిక సంస్థల ఎంఎల్‌సీ వాకాటిని ఏపీలో జరిగే ఎన్నికలకు ఇన్‌ఛార్జ్‌గా నియమిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. గతంలోనూ భారతీయ జనతా పార్టీ తరపున పలు ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా, బహిరంగ సభల నిర్వహణ బాధ్యతలను కూడా వాకాటికి అప్పగించి ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉపాధ్యా యుల, పట్టభద్రుల వంటి కోటాలలో స్థానిక శాసనమండలి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. గతంలో రెండుసార్లు స్థానిక సంస్థల కోటాలో కాంగ్రెస్, టీడీపీల తరపున ఎంఎల్‌సీగా గెలిచిన వాకాటి ప్రస్తుతం బీజేపీలో కొనసాగుతున్నారు.

## ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైసీపీ గెలవడం ఖాయం




తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త : ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైసీపీ గెలవడం ఖాయమని చిత్తూరు ఎంపీ ఎన్. రెడ్డెప్ప, ఎమ్మెల్సీ కె.ఆర్.జే భరత్‌లు వారి అభిప్రాయాన్ని వ్యక్త చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాస గృహం మారుతీ నగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ నేతలను పరామర్శించడానికి వచ్చిన లోకేష్ సీఎం జగన్మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. లోకేష్‌కు జగన్, పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి లేదన్నారు. జగన్, పెద్దిరెడ్డిలను చంద్రబాబు, లోకేష్‌లు భయపడుతున్నారన్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబు కుప్పం మాజీ ఎమ్మెల్యేగా మిగిలిపోతారని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మలగుంటలో....భారీ పైనాపిల్ వినాయకుడు

**-1,11 కిలోల భారీ లడ్డూ ప్రసాదం -**

**పిల్లలలో భక్తి, సభ్యత, సంస్కారం, సంప్రదాయం -ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి**



తిరుపతిరూరల్, సెప్టెంబర్1 ప్రభాతవార్త: తుమ్మలగుంటలో పైనాపిల్స్‌తో ఏర్పాటు చేసిన భారీ వినాయ కుడు మహా అద్భుతంగా కొలువుదీరాడు. మంగళవ వాయిద్యాలు వాయిస్తూ.. .బాల వినాయక ప్రతిమలు భక్తులను కట్టిపడేసాయి, చెరకు గడలతో గణేష్ మండపాన్ని తీర్చిద్దిన వైనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పిల్లలలో భక్తిభావంతో పాటు సభ్యత, సంస్కారం, సంప్రదాయా లను పెంపొందించేందుకు దశాబ్ద కాలం క్రితం తుమ్మలగుంట బాల వినాయక కమిటీ ఆవిర్భ వించిందని చంద్రగిరి ఎమ్మెల్యే పేర్కొన్నారు. భక్తులను మరింత ఆలోచింప చేసే విధంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి సహకా రంతో వినూత్న పద్ధతులలో వినాయక ప్రతిమలు రూపొంది ంచినట్లు వినాయక కమిటీ అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పేర్కొన్నారు. 7వేల పైనాపిల్స్‌తో 22 అడుగుల ఎత్తు, 15 అడుగుల వెడల్పుతో రూపొందిన వినాయకుని ప్రతిమ రాయలసీమలోనే అతిపెద్దదిగా ప్రత్యేక ఆకర్షనగా నలిచింది. వినాయక చవితిని పురస్కరించుకుని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి గణేష్ మండపాన్ని ఆవిష్కరించడంతో పాటు భారీ పైనాపిల్ వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. తుమ్మలగుంటలో వినాయక ఉత్సవాలలో భాగంగా 1,116 కేజీల భారీ లడ్డు ప్రసాదం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినాయక ఉత్సవాలు ఈనెల 4న ఆదివారం ముగియనున్నాయని ఛైర్మెన్ హర్షిత్‌రెడ్డి తెలిపారు. పైనాపిల్స్‌తో ఏర్పాటు చేసిన వినాయకుడుని ప్రజలు తండోపతండాలుగా వచ్చి దర్శించుకుంటున్నారు.

## మన్నసముద్రంలో పలు కార్యక్రమాలకు భూమిపూజ



శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త : తిరుపతి పార్లమెంటు పరిధిలోని శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం మన్నసముద్రం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంపి డాక్టర్ గురుమూర్తి, శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఎంపి స్వగ్రామంలో గురువారం పలు కార్యకర్తలతో కలసి పాల్గొన్నారు. కార్యక్రమంలో వీరికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు భూమిపూజ చేశారు. అనంతరం గ్రామస్తులకు సురక్షితమైన మంచినీటిని అందించేందుకు ఎంపి గురుమూర్తి లోకా ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్ళగా పౌండేషన్ అధినేత లోకేష్‌దాసు నిర్మాణానికి సంసిద్ధత వ్యక్తం చసి నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ఆయన చేత ప్రారంభించారు. అలాగే గ్రామంలో కొత్తగా నిర్మించిన తపాలా కార్యాలయ భవనాన్ని ప్రారంభించి గ్రామానికి తపాలా సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. చివరగా గ్రామంలో రైతు ఉత్పత్తుల సంస్థ(ఎఫ్‌సిఓ) భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపి సహకారంతో మన్న సముద్రం గ్రామం ఓఆదర్శ గ్రామంగా రూపుదిద్దుకుంటుందని ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి అన్నారు. ఎంపి గురుమూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో ఎంఎల్‌ఏ సహకారంతో గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేస్తాన్నన్నారు.కార్యక్రమంలో లోకా పౌండేషన్ అధినేత లోకేష్‌దాసు, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ (తిరుపతి), ఏర్పేడు మండల ఇన్‌ఛార్జి కిషోర్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ నాగార్జున్‌రెడ్డి, వైస్ ఎంపిపి జనార్ధన్, సర్పంచ్ వనజమ్మ, ఎఫ్‌పిఓ, సిబిబిఓ పివిరత్నం, యూనియన్‌బ్యాంకు మేనేజర్ మనోజ్, డిసిసిబి బ్యాంకు మేనేనేజర్ సురేష్,మండల వైకాపా నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అప్పులబాధతో రైతు ఆత్మహత్య



శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త : మండలంలోని వాగివేడు హరిజనవాడకు చెందిన రైతు మటంజనార్ధన్(32) అప్పులాధతో ఆత్మహత్య చేసుకోవడం భాదాకరం అని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోట ఆవేదన వ్యక్తంచేశారు. ఆమె హరిజనవాడకు చేరుకుని మృతునికి పూలమాల వేసి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు జనార్ధన్ రెండు ఎకరాల్లో కౌలుకు చేసుకునేవాడని, ఇటీవల వేరుశనగ పంట వేసి నష్టం రావడంతో కౌలు ఇవ్వలేక, అప్పులు కట్టలేక ప్రతి ఏడాది అప్పులతో పాటు దాదాపు రూ.6 నుంచి రూ.7లక్షలు తీర్చలేకపోయాడని కుటుంబసభ్యులు వినుతకు వివరించినట్లు తెలిపారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ మృతుని కుటుంబానికి అండగా ఉంటారని పార్టీ నుంచి కుటుంబాన్ని తప్పక ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

## బంగారం పండే భూములకు పరిహారం ఇవ్వాలి

**- గూడూరు ఆర్డీవోతో రైతులు**

కోట, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త : మండలంలోని సాగరమాల రోడ్డు వేస్తున్న నేపథ్యంలో మూడు కార్లు పండే పంటలకు పరిహారం ఎక్కువ ఇవ్వాలని నెల్లూరుపల్లి, నెల్లూరుపల్లి కొత్తపాలెం, అగ్రహారం గ్రామాల రైతులు గూడూరు ఆర్డీవో మురళీకృష్ణను కోరారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో మురళీకృష్ణ ఆయా గ్రామాల రైతులతో మాట్లాడారు. ఎకరాకు రూ.10 లక్షలు చొప్పున ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని అధికారులు చెప్పడంతో రైతులు అంగీకరించలేదు. ఒక ఎకరాకు రూ.25 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. ఎక్కడో కొత్తపట్నం గ్రామంలో పరిశ్రమల కోసం ఎకరాకు రూ.20 లక్షలు ఇస్తుందని, ఇక్కడ మాత్రం పంటలు పండే భూములకు పరిహారం తక్కువ ఇస్తే ఎలాగని రైతులు ప్రశ్నించారు. రైతుల అభ్యంతరాలను ఆర్డీవో మురళీకృష్ణ స్వీకరించారు. ఆర్డీవో వెంట తహశీల్దార్ పద్మావతి ఉన్నారు.

## తడ పల్లెల్లో కొలువుతీరిన గణనాథుడు

తడ, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త : వినాయక చవితి పర్వదినం సందర్భంగా తడ మండలంలోని పలు గ్రామాల్లో గణేశుని విగ్రహాలు కొలువుతీరాయి. బుధవారం వినాయక చవితిని ఈ సారి ఘనంగా జరుపుకున్నారు. గత రెండేళ్ల కరోనా ఇబ్బందులు తగ్గడం ఇందుకు ఒక కారణంగా ఉంది. ఈ సారి సాంప్రదాయబద్ధంగా పూజలు చేయడంతో పాటు గణేశ విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మండల పరిధిలోని విగ్రహాలను పులికాట్ సరస్సు, కాళంగి నదిలలో నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అందుబాటులో ఉన్న నీటి వనరులతో పాటు ఆయా గ్రామాల భక్తుల స్థోమతను బట్టి మూడురోజుల నుంచి తొమ్మిదిరోజులు దాకా విగ్రహాలకు పూజలు చేసి అనంతరం నిమజ్జనానికి తరలించేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఈసారి విగ్రహాల ఏర్పాటుకు ప్రభుత్వం, పోలీసులు కొన్ని నిబంధనలు విధించక తప్పలేదు. అయినప్పటికీ భక్తులు కోలాహలంగా ఉత్సవాలు చేస్తున్నారు.





రేణిగుంట సమీపంలోని సిల్వర్‌బెల్స్ పాఠశాల దగ్గర ఏర్పాటు చేసిన మహాగణపతి విగ్రహం.

ప్రభాతవార్త, రేణిగుంట